## బాధిత రైతు కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మండలంలోని బుగ్గారం గ్రామానికి చెందిన రైతు జాదవ్ గంగాధర్ పంట దిగుబడి రాక, బ్యాంకులో ఉన్న పంట రుణ మాఫీ కాకపోవడంతో ఇటీవల తన ఇంటి ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం బాధిత రైతు కుటుంబాన్ని గ్రామ పెద్ద ధనరాజ్ తో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రారకపోవడంతో మనోవే దనకు గురై రైతు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి జిఓ నం.194 ప్రకారం రూ.6లక్షల పరిహారంతో పాటు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని కోరారు. అలాగే కుటుంబ యజ మానురాలికి నెలకు రూ.5వేల పెన్షన్, పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది కలిసి అవగాహన సదస్సులు నిర్వహిం చాలని, ప్రతి రైతుకు నెలసరి రూ.15వేల ఆదాయంతో చిరు ధాన్యాలు, ఆకు కూరగాయల సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆయన వెంట కిసాన్ మిత్ర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ షారుఖ్, ధనరాజ్, పృథ్వీ, రామ్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా శ్రీరామ నవమి రథోత్సవం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** శ్రీరామ నవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఈ ఏడాది శ్రీరామ నవమి రథోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. స్వామివారి రథాన్ని పూలతో సుగంధం నింపి అందంగా అలం కరించారు. ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ వేడుకలో స్వామివారి రథోత్సవం ప్రారంభమై, రథంపై శ్రీ సీతా రామచంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్టించి, వీధుల్లో ఊరేగించారు. భక్తులు జై శ్రీరాం.. నినాదాలతో మార్మోగించారు. భజన మండళ్లు హరినామ సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగడం విశేషంగా నిలిచింది. మహిళలు మంగళ హారతులు ఇచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలోని పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందించారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి పండుగలు ప్రజల్లో భక్తి భావనతో పాటు పరస్పర ప్రేమ, గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గంభీరావుపేటలో ప్రతి సంవత్సరం నిర్వహించే రథోత్సవం ప్రాంతీయంగా మంచి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ రథోత్సవం భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

## గజదొంగ మోయిజ్ పై పిడి యాక్ట్ నమోదు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలో వరుస దొంగత నాలకు పాల్పడుతున్న గజదొంగ మోయిజ్‌పై పోలీసులు పిడి యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) కింద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. సుమారు 15 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ, ఇప్పటివరకు దాదాపు 70 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న మోయిజ్ పై 2019లో కూడా పిడి యాక్ట్ కింద కేసు నమోదు అవ్వడంతో ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. అయితే విడుదలైన తర్వాత కూడా తన ప్రవర్తనలో మార్పు లేకుండా మళ్లీ దొంగతనాలకు పాల్పడటం ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతను కాపాడడం కోసం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సుతో జిల్లా కలెక్టర్ నిందితుడిపై మళ్లీ పిడి యాక్ట్ నమోదు చేశారని చెప్పారు. కేసు నమోదు అనంతరం నిందితుడిని శనివారం చర్లపల్లి జైలుకు తరలించడం జరిగిందన్నారు. మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, చట్టం పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు




**ఉద్యమ కెరటం, తిర్యాణి:** అసాంఘిక కార్యక లాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు. శనివారం తిర్యాణి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హాజరు రిజిస్టర్, శుభ్రత తదితర అంశాలను పరిశీ లించారు. ఎస్‌హెచ్ఓ వెంకటేష్ కు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతలో ప్రతి పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్య తిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మండల కేంద్రం, గ్రామాల్లో ప్రజలు, వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాది దారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరిం చాలని, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శాంతి భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట పర్యవేక్షణ, పెట్రోలింగ్ కొనసాగిం చాలని ఆదేశించారు.

## ఆన్లైన్ బుకింగ్ తో పారదర్శకంగా ఇసుక సరఫరా

### తహశీల్దార్ మారుతి రెడ్డి




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “తెలంగాణ మన ఇసుక వాహనం” పథకం ద్వారా ఇసుక సరఫరాను పారదర్శకంగా, సులభంగా అందుబాటు ధరల్లో అందించడం జరుగుతుందని తహశీల్దార్ మారుతి రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలు మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. దీంతో అక్రమ ఇసుక రవాణా తగ్గడమే కాకుండా వినియో గదారులకు ఇసుక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేసిన వాహనాల ద్వారా ఇసుకను నేరుగా వినియోగదారుల ఇంటి వద్దకు పంపించడం జరుగుతుందని,. దీంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని అనానరు. ఇసుక బుకింగ్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింద ని, https://tsmiv.cgg.gov.in ద్వారా సులభంగా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రజలు తప్పనిసరిగా అధికారిక వెబ్‌సైట్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించారు. అనధికారిక వ్యక్తులు, మధ్యవ ర్తులను ఆశ్రయించవద్దని తెలిపారు. ఎవరైనా అధిక ధరలు వసూలు చేసినా, అక్రమ ఇసుక రవాణా గమనించినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ పథకం ద్వారా సహజ వనరుల సంరక్షణతో పాటు సమానంగా ఇసుక పంపిణీ చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

## నాణ్యమైన విద్య అందించడం మా లక్ష్యం



**ఉద్యమ కెరటం, వేంసూర్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందించడం మా లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి చలంచర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన తల్లి దండ్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో ఉండాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధులక్ష్మి, ఏపీపీసీ చైర్మన్ కర్రీ విజయ్, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు బొంతు శ్రీనివాస రావు, జెడ్పీఎస్ఎస్ వెంకటాపురం ప్రధానోపాధ్యాయులు మిరియాల రవిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, తల్లి దండ్రులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి





**ఉద్యమ కెరటం, తిర్యాణి:** ఆరోగ్యం పట్ల ప్రజలు ప్రత్యే శ్రద్ధ వహించాలని డాక్టర్ యశ్వంత్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రొంపల్లి ప్రాథమిక వైద్యశాల పరిధిలో గల మంగి ఉప కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పల్లవి నేతృత్వంలో జరిగిన ఈ శిబిరం ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మైనర్ బాలికను లైంగికంగా వేధించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలంలోని నార్లపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణ గత కొంత కాలంగా కెరమెరి మండలానికి చెందిన ఓ మైనర్ బాలికను వేధిస్తున్నాడు. బాలిక స్కూల్‌కు వెళ్తున్న సమయంలో వెంటపడటం, ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిం చినట్లు పేర్కొన్నారు. ప్రేమ పేరుతో బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# టీపీసీసీ అధ్యక్షునికి బోరంచు సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** డీసీసీ నూతన కార్యవర్గం, యాక్షన్ కమిటీ సమావేశం సందర్భంగా శనివారం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సచిన్ సావంత్‌లకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. మావల బైపాస్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, జిల్లా ముఖ్య నాయకులతో కలిసి మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన యాక్షన్ కమిటీ సమావేశంలో మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ఇటీవల నూతనంగా నియమితులైన డీసీసీ కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తల కృషితోఏ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వందకు పైగా సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేసులు ఎదుర్కొని లాఠీ దెబ్బలు తిన్నారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమని, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు మంచి రోజులు తీసుకు వచ్చామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరవేసి పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంఘటన్ సృజన్ అభియాన్‌తో కాంగ్రెస్ బలోపేతం

## ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సంఘటన్ సృజన్ అభియాన్‌తో కాంగ్రెస్ బలోపేతం అవుతుందని ఏఐసీసీ కార్యదర్శి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సచిన్ సావంత్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గ సమీక్ష సమావేశం, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన్ సృజన్ కార్యక్రమం ద్వారా అన్నివర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తూ పారదర్శకంగా జిల్లా అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గాన్ని నియమించామని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కార్యవర్గం కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని, సామాజిక న్యాయం, దేశ ప్రగతికి వారు మూలస్తంభాలుగా నిలవాలని అన్నారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ కాంగ్రెస్ పార్టీ ఉండాలనే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం గుజరాత్ మోడల్ పేరుతో దేశ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణలో నిజమైన ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా ఇది స్పష్టమైందన్నారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కార్యవర్గ సభ్యులకు సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జాతి, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా దేశాన్ని ఐక్యంగా నిలబెట్టే లక్ష్యంతో సాగిందని తెలిపారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి గ్రామాలే గుండెకాయలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, నాయకులు, కౌన్సిలర్లు, నూతన కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశ్రామిక అభివృద్ధికై ఆదిలాబాద్‌కు ప్రత్యేక ప్యాకేజీ

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్యాకేజీ అందించేలా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన నూతన కార్యవర్గ సమీక్ష సమావేశం, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రూ.23వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం చారిత్రాత్మక నిర్ణయమని, గతంలో దొడ్డు బియ్యం పేరుతో పెద్ద ఎత్తున లూటీ జరిగిందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతిపక్షాలు తుఫాన్‌లో కొట్టుకుపోతాయని అన్నారు. పార్టీ పదవుల్లో 74 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. దేవుడి పేరు మీద ఓట్లు అడిగే పని బీజేపీ చేస్తోందని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8లక్షల కోట్లకు పైగా అప్పుల భారం మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లా డే అర్హత ప్రతిపక్ష పార్టీలకు లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. సామాన్యుడి అవసరాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా పేదలకు సహాయం అందిస్తున్నామని అన్నారు. నామినేట్ పదవుల్లో ఆదిలాబాద్ జిల్లాకు కీలక స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అన్నివర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తోందని, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ అంతర్గత తగాదాలతోనే కాలం గడుపుతోందని విమర్శించారు. తెలంగాణను దేశానికి మోడల్ రాష్ట్రంగా నిలబెడతామని తెలిపారు. కార్యకర్తలు నిరుత్సాహపడకుండా అందరికీ న్యాయం చేస్తామని, బీఎల్ఏ–1, బీఎల్ఏ–2లను నియమించి పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దేశం కోసం త్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీని బీజేపీతో పోల్చలేమని, ప్రధాన మంత్రి పదవిని కూడా త్యాగం చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, నూతన కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్‌పై దాడులు

- 5 ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లి ంగ్ జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు స్టేట్ టాస్క్ ఫోర్స్ బృందం, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అధికారులు శ్రీ రాజ్‌కుమార్, శ్రీనివాస్, పోచయ్య ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా, అక్రమంగా గ్యాస్ రీఫిల్లి ంగ్ కోసం నిల్వ ఉంచిన మొత్తం 5 డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. స్వాగత్ హోటల్ వెనుక చాపిడి సాయి కుమార్ షెడ్ వద్ద 2 సిలిండర్లు, న్యూ స్వాగత్ రెస్టారెంట్ వెనుక ఉన్న షెడ్ వద్ద 3 సిలిండర్లు గుర్తించి సీజ్ చేశారు. అదనంగా గ్యాస్ రీఫిల్లి ంగ్ కోసం ఉపయోగిస్తున్న డంపింగ్ పెనామెషిన్, ఇతర పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎల్పీజీ సరఫరా, పంపిణీ నియంత్రణ చట్టాలకు విరుద్ధంగా ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నందున బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా దాసరి రమేశ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భాగంగా భీంపూర్ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గ్రామ సర్పంచ్ దాసరి రమేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా దాసరి రమేశ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం తాను అహర్నిశలు కష్టపడి పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

# టీపీసీసీ అధ్యక్షునికి చరణ్ గౌడ్ సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సమీక్ష సమావేశం, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, 40వ వార్డు కౌన్సిలర్ చరణ్ గౌడ్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు సూచించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ జిల్లా వ్యాప్తంగా యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొ న్నారు.

# శ్రీరాముల వారి ఆలయంలో ప్రత్యేక ముడుపులు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలో అకాల వర్షాలు పడకుండా ఉండాలని కోరుతూ రైతులు శ్రీ రాములవారి దేవాలయంలో ప్రత్యేకంగా ముడుపులు కట్టారు. యాసంగి పంటలు చివరి దశలో ఉన్న ఈ సమయంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని రైతులు దేవుని ఆశీర్వాదం కోసం సమూహంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కట్టా రు. పంటలు సురక్షితంగా కోతకు రావాలని శ్రీరాముడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే రైతులు గంట శ్రీనివాస్, అక్కపెల్లి బాలయ్య, కోటయ్య గారి రాజేందర్ రెడ్డి, మాడుగుల రాజమల్లయ్య, పెద్దవేని రాజమల్లయ్య, మాడుగుల సంజీవ్, గంట రమేష్, గంట రాజు, గోగు రాములు, కోటలింగం శంకర్, ముత్యంరావు పటేల్, రాంరావు, లింగం యాదవ్, మాడుగుల మహేష్, దేశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొ న్నారు.

# గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసినప్పుడే రాబోయే ఎన్నికల్లో విజయాలు సాధించగలమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా లో నిర్వహించిన కాంగ్రెస్ నూతన కార్యవర్గ సమీక్ష సమావేశం, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసిందో అక్కడ జరిగిన తప్పిదాలను గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేసినప్పుడే ఏ ఎన్నికలైనా సులభంగా గెలవగలమన్నారు. నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటేనే ప్రజలు తమ సమస్యలు, పంచాయతీలను చెప్పుకుంటారని తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేసే వారే నిజమైన నాయకులని పేర్కొన్నారు. అలాగే నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

